# సాక్షి కర్నూలు

శనివారం । 8 । జూన్ । 2024






### భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. అంతకుముందు కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు.



### అలరించిన తోలుబొమ్మలాట

శ్రీశైలం టెంపుల్: నిత్యకళారాధన వద్ద శుక్రవారం వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన నరసింహారావు,బృందం రామాయణం సుందరకాండపై నిర్వహించిన తోలు బొమ్మలాట అలరించింది.



### మృగశిర వచ్చె.. వానలు తెచ్చె!

మృగశిర కార్తె రాకతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ కార్తెను పురస్కరించుకుని జిల్లాలో నల్ల కోడి, నల్ల పొట్టేలు, నల్ల మేకపోతు మాంసంతో పండుగ చేసుకుంటారు. 8లో▸

## న్యూస్‌రీల్

### రూ.6.81 కోట్లతో ఉద్యాన పథకాలు

కర్నూలు(అగ్రికల్చర్): 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉద్యాన పంటల సాగుకు ప్రతిపాదనలు పంపాలని ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. అన్ని రకాలతో కంపోనెంట్ల కింద రూ.6.81 కోట్లతో ఈ ప్రతిపాదనలు రూపొందించి పంపాలని సూచించడంతో జిల్లా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. పండ్లతోటల విస్తరణ, యాంత్రీకరణ, పాతతోటల పునరుద్ధరణ, సమీకృత పోషకాల యాజమాన్యం, సమీకృత పురుగు మందుల యాజమాన్యం తదితర కాంపోనెంట్ల కింద ప్రతిపాదనలు పంపడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు తెలిపారు.

### నేషనల్ అడ్వెంచర్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 2023 సంవత్సరానికి గాను టెన్జింగ్ నార్కే నేషనల్ అడ్వెంచర్ అవార్డు కోసం గత మూడు సంవత్సరాల్లో భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి పీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహస క్రీడల్లో తమను తాము అంకితం చేసుకుని నైపుణ్యాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా బహూకరిస్తారన్నారు. అవార్డు గ్రహీతకు టెన్జింగ్ నార్కే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసాపత్రం, రూ.15లక్షల నగదు బహుమతి అందజేస్తారని తెలిపారు. ఈ అవార్డుకు వెబ్‌సైట్ https://awards.gov.in ద్వారా దరఖాస్తును ఈ నెల 14వ తేదీలోగా చేసుకోవాలన్నారు.

### 16 మండలాల్లో వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో రుతుపవనాల ప్రభావంతో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 16 మండలాల్లో వర్షాలు కురిశాయి. రెండు, మూడు మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. హాలహర్విలో 52.4 మిమీ, ఓర్వకల్‌లో 43, హొలగుందలో 42.4, కర్నూలు అర్బన్‌లో 20.2, కర్నూలు రూరల్‌లో 13.4, నందవరంలో 10.8 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. పెద్ద కడుబూరు, కౌతాళం, ఆలూరు, గోనెగండ్ల, కల్లూరు తదితర మండలాల్లో కూడా ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా సగటున 8.7 మి.మీ వర్షపాతం నమోదైంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మిమీ ఉండగా... మొదటి వారంలోనే 58.1 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతుండటంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పత్తి, వేరుశనగ, కంది తదితర పంటల సాగు ఊపందుకుంటోంది.


### డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా

కర్నూలు (అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ పదవికి సీహెచ్ శిరోమణి మద్దయ్య రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడం, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇన్నాళ్లు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని డీసీఎంఎస్‌ను అభివృద్ధిలోకి తెచ్చినట్లు తెలిపారు. విధి నిర్వహణలో సహకరించిన పాలకవర్గ సభ్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రాజీనామా పత్రాన్ని జిల్లా సహకార అధికారి రామాంజనేయులుకు పంపినట్లు శుక్రవారం ఆమె విలేకరులకు వెల్లడించారు.

### ఓపెన్ స్కూల్ పరీక్షలకు 91 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: జిల్లాలో శుక్రవారం ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు 91 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ శామ్యూల్ తెలిపారు. 10వ తరగతి పరీక్షలకు 556 మందికి 465 మంది, ఇంటర్ పరీక్షలకు 727 మందికి 636 మంది హాజరయ్యారన్నారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

### జీడీపీకి వరద నీరు



గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్ట్‌కు వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో గత మూడురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జీడీపీలోకి దాదాపు 1100 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరినట్లు ఏఈ మహమ్మద్ అలీ తెలిపారు. నాలుగు రోజుల క్రితం 0.6 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, శుక్రవారానికి ఇది 0.7 టీఎంసీలకు చేరిందని వెల్లడించారు. 4.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నుంచి తాగునీటి అవసరాల కోసం కర్నూలుకు 30 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు ఏఈ తెలిపారు.

# స్వర్ణ 'సీమ'

రాళ్ల సీమ బంగారు సీమగా మారుతోంది. జియో మైసూర్ ఆధ్వర్యంలో పగడిరాయి సమీపంలో చేపట్టిన బంగారు వెలికితీత పైలెట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో ఆగస్టు నుంచి పూర్తిస్థాయిలో బంగారం వెలికితీతకు ఆ సంస్థ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇటీవలే పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి కూడా ప్లాంటును సందర్శించి ఉత్పత్తి, తదితర వివరాలను ఆరా తీసి ప్లాంటుకు కావల్సిన సహకారం అందించారు. ఈ ప్లాంటుతో దేశంలో మూడో గోల్డ్‌మైన్స్‌గా కర్నూలు నిలువనుంది. ఈ మైన్‌తో జిల్లా వాసులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయం చేకూరనుంది.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

**తుగ్గలి మండలం పగిడిరాయి వద్ద బంగారం తవ్వకాలు**

- ఫలించిన పైలెట్ ప్రాజెక్టు.. మట్టిరేణువుల్లో పుత్తిడి ధగధగలు
- ఆగస్టు నుంచి పూర్తిస్థాయిలో బంగారు ఉత్పత్తికి అవకాశం
- 1,495 ఎకరాలను లీజుకు తీసుకున్న 'జియో మైసూర్'
- రూ.300 కోట్లతో ప్రాజెక్టు
- తొలి విడతలో ఏడాదికి 750 కిలోల బంగారు ఉత్పత్తి
- స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- సర్కారు ఖజనాకు భారీ ఆదాయం



పైలెట్ ప్రాజెక్టులో భాగంగా పగిడిరాయి వద్ద ఏర్పాటు చేసిన మట్టిని డ్రిల్ చేసే యంత్రం

వర్షాకాలం వస్తే జొన్నగిరి మండలంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనాలంతా వాలిపోతారు. వజ్రాల కోసం రోజుల తరబడి అన్వేషిస్తారు. అయితే ఈ ప్రాంతంలో వజ్రాలతో పాటు బంగారు గనులు కూడా ఉన్నాయి. ఎన్నో కంపెనీలు పరిశోధనలు చేసినా వెలికితీతకు భారీగా ఖర్చవుతుందనే కారణంతో ముందుకు రాలేదు. అయితే ఆస్ట్రేలియాకు చెందిన 'జియోమైసూర్' కంపెనీ ఇక్కడి భూములు లీజుకు తీసుకుని పనులు పూర్తి చేసింది.

**1,495 ఎకరాల్లో బంగారు నిక్షేపాలు**

తుగ్గలి మండలం జొన్నగిరి, పగిడిరాయి, బొల్లవానిపల్లి చుట్టుపక్క ప్రాంతాల్లో భూగర్భంలో బంగారు నిక్షేపాలు ఉన్నాయి. వీటి కోసం ఎన్నో కంపెనీలు సర్వేలు చేశాయి. 1994లోనే జీఎస్‌ఐ(జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా) సర్వే చేసి గనులు ఉన్నాయని నిర్ధారించింది. అయితే బంగారు ఉత్పత్తి, వ్యయం, అప్పట్లో బంగారానికి మార్కెట్‌లో ఉండే డిమాండ్, ధరల నేపథ్యంలో లాభం కంటే వ్యయం ఎక్కువగా ఉందని ముందుకు రాలేదు. మైనింగ్‌లో విదేశీ పెట్టుబడులను భారత ప్రభుత్వం ఆహ్వానించిన తర్వాత 2005లో ఆస్ట్రేలియాకు చెందిన జియోమైసూర్ సంస్థ దరఖాస్తు చేసుకుంది. 597.82 హెక్టార్ల (1495 ఎకరాలు)లో బంగారం నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. 2013లో నిక్షేపాల వెలికితీతకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసి అనుమతులు తీసుకుంది. ఎకరా రూ.12 లక్షల చొప్పున 70 ఎకరాల వరకు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంది. తక్కిన భూములను కౌలు ప్రాతిపదికన సేకరించింది. ఎకరాకు రూ.16,500 కౌలు చెల్లిస్తోంది. వీటితో పాటు మరో 250 ఎకరాలను కొనుగోలు చేస్తోంది.

**మూడేళ్ల కిందట ప్రారంభమైన పనులు**

2013లోనే లీజు పూర్తయినా, అనివార్య కారణాలతో పనులు ప్రారంభించేందుకు కంపెనీ ముందుకు రాలేదు. 2021లో పనులు ప్రారంభించిన ఈ సంస్థ ప్రొడక్షన్ ప్రాసెస్ యూనిట్‌ని ఏర్పాటు చేసి పనులు వేగవంతంగా పూర్తి చేసింది. గతేడాది ఫిబ్రవరిలో చిన్నప్లాంట్‌లో బంగారు ఉత్పత్తిని ప్రారంభించింది. దీన్ని బెంగళూరులోని ల్యాబ్‌కు పంపితే మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో పూర్తిస్థాయి ఉత్పత్తి లక్ష్యంగా పనులు పూర్తి చేసింది. దక్షిణాఫ్రికా, చైనా నుంచి మిషనరీ వచ్చింది. క్రషర్లు, గ్రౌండింగ్ యూనిట్లు దేశీయంగా కొనుగోలు చేశారు. ఈ ఆగస్టు నుంచి పూర్తిస్థాయిలో బంగారు ఉత్పత్తి ప్రారంభం కానుంది. రూ.300కోట్ల వ్యయంతో ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. దీని ద్వారా ప్రత్యక్షంగా 300 మందికి, పరోక్షంగా 1,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సాధారణంగా ఓపెన్ కాస్ట్ మైనింగ్ 10 ఏళ్ల పాటు ఉంటుందని, అంతా సవ్యంగా జరిగితే 25 ఏళ్ల వరకు కొనసాగవచ్చని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

**స్వాతంత్య్రం తర్వాత దేశంలో తొలి 'గోల్డ్‌మైన్'**

మన దేశంలో 1880లో కోలార్ గోల్డ్‌మైన్‌ను ప్రారంభించారు. ఆపై బ్రిటీష్ హయాంలోనే 1945లో రాయచూర్‌లోని 'హట్టిమైన్స్'ను మొదలెట్టారు. అయితే స్వాతంత్య్రం తర్వాత ఇప్పటి వరకూ దేశంలో ఎక్కడా గోల్డ్‌మైనింగ్ చేపట్టలేదు. ఇప్పుడు 'జియో మైసూర్' చేసే ఉత్పత్తే తొలి మైనింగ్.

**రాష్ట్ర ప్రభుత్వానికి 4.6 శాతం పన్నులు**


బంగారు ఉత్పత్తి చేసే కంపెనీ మొదట రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ, డీఎంఎఫ్(డిస్ట్రిక్ మినరల్ ఫండ్) కలిపి ఉత్పత్తిలో 4.6శాతం చెల్లించాలి. అలాగే కేంద్ర ప్రభుత్వానికి ఎన్‌ఎంఈటీ( నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లనేషన్ ట్రస్టు)కు 0.5శాతం చెల్లించాలి. డోరేబార్ నుంచి బంగారు బులియన్‌గా మారిన తర్వాత 25–30శాతం కేంద్ర ప్రభుత్వానికి ట్యాక్స్‌లు చెల్లించాలి. దీంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్‌టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

**తొలివిడతలో ఏడాదికి 750 కిలోల బంగారు ఉత్పత్తి**

- ఇప్పటి వరకూ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా రోజుకు 20 టన్నుల మట్టి తవ్వి ప్రాసెసింగ్ చేశారు.
- ఇందులో 40–50 గ్రాముల బంగారు ఉత్పత్తి అవుతోంది.
- గతేడాది ఫిబ్రవరి 15 నుంచి పైలెట్ ప్రాజెక్టులో రెగ్యులర్‌గా ఉత్పత్తి జరిగింది.
- ప్రధాన ప్లాంటు కూడా పూర్తి కావడంతో ఆగస్టులో పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభమైతే ఏడాదికి 750 కిలోల బంగారు ఉత్పత్తి కానుంది.
- ఆ తర్వాత సామర్థ్యాన్ని పెంచనున్నారు.
- ప్రస్తుతం 'డోరేబార్'(క్రషింగ్ తర్వాత లోహాన్ని 300 డిగ్రీల వద్ద హీట్ చేసి స్మెల్ట్ చేయడం) పనులు చేస్తున్నారు.
- డోరేబార్ ద్వారా వచ్చిన లోహాన్ని రిఫైనరీలకు ఇస్తారు.
- రిఫైనరీలో దాన్ని 'బులియన్'(99.99 శాతం స్వచ్ఛమైన బంగారం) చేసి మార్కెట్‌లో విక్రయిస్తారు.

# పోలీసు శాఖలో బదిలీలపై ఊహాగానాలు

- కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు క్యూ కట్టిన పోలీసు అధికారులు
- ప్రధాన స్థానాల కోసం పైరవీలు





కర్నూలు: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో జిల్లా పోలీసు శాఖలో బదిలీలపై తీవ్ర చర్చ జరుగుతోంది. కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతలను బట్టి పోస్టింగులు ఉంటాయన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న పోలీస్ సబ్ డివిజన్ల అధికారులు, కీలక సర్కిళ్లలో కొనసాగుతున్న వారికి బదిలీలు తప్పవని కొత్తగా ఎన్నికైన టీడీపీ ప్రజాప్రతినిధులు సంకేతాలు ఇస్తున్న నేపథ్యంలో ఆశావహులు వారి ఇళ్ల వద్ద గత మూడు రోజులుగా క్యూ కడుతున్నారు. ఎస్‌ఐ, ఆ పైస్థాయి అధికారులందరి పోస్టింగులు రాజకీయంగా ముడిపడి ఉన్నాయి. దీంతో కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవటానికి కొంతమంది పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి వీరవిధేయులుగా పనిచేసిన వారిలో కొంతమంది తిరిగి జిల్లాలో పోస్టింగులను దక్కించుకునేందుకు మర్యాదపూర్వకం పేరుతో పార్టీ ముఖ్య నేతలను కలుస్తున్నట్లు సమాచారం. గతంలో కర్నూలు రెండో పట్టణ సీఐగా పనిచేసి ప్రస్తుతం సీఐడీ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న ఒక అధికారి కర్నూలు లేదా డోన్ సబ్ డివిజన్ అధికారిగా వచ్చేందుకు టీడీపీ ముఖ్య నేతలను సంప్రదించినట్లు తెలిసింది. అలాగే గతంలో కర్నూలు డీఎస్పీగా పనిచేసి బదిలీపై పొరుగు జిల్లాకు వెళ్లి ఎన్నికల ముందు పదోన్నతి పొందిన ఒక అధికారి కర్నూలు అదనపు ఎస్పీగా వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసు అధికారుల్లో చర్చ జరుగుతోంది. అలాగే గతంలో నాలుగో పట్టణ సీఐగా పనిచేసిన ఓ అధికారి ప్రస్తుతం రిజర్వుడ్ నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం భారతీయ జనతా పార్టీ ముఖ్య నేతను కలిసి కర్నూలు టూటౌన్‌కు పోస్టింగ్ ఇప్పించాలని అభ్యర్థించినట్లు సమాచారం.అలాగే గతంలో కర్నూలులో పని చేసి కడప జిల్లాకు బదిలీపై వెళ్లిన మరో ఇద్దరు సీఐలు కోడుమూరు లేదా కర్నూలు అర్బన్ తాలూకా పీఎస్‌లో పోస్టింగ్ కోసం రిజర్వుడ్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్‌తో సంప్రదింపులు జరిపినట్లు అధికారుల్లో చర్చ జరుగుతోంది. అలాగే కర్నూలు రెండో పట్టణం, సీఐడీ విభాగంలో విధులు నిర్వహించి ఎన్నికల ముందు డీఎస్పీగా పదోన్నతిపై మరో జిల్లాకు బదిలీపై వెళ్లిన అధికారి కూడా జిల్లాలోని ప్రాధాన్యత గల సబ్ డివిజన్ పోస్టింగ్ కోసం అధికార పార్టీ నేతలను సంప్రదించినట్లు సమాచారం. అయితే ప్రధానంగా కర్నూలులోని 2వ, 3వ, 4వ పోలీస్ స్టేషన్లతో పాటు కోడుమూరు, కర్నూలు అర్బన్, తాలూకా పోలీస్‌స్టేషన్ల పోస్టింగుల కోసం అధికారుల మధ్య తీవ్ర పోటీ ఉంది. గత ఐదేళ్లుగా లూప్‌లైన్ విభాగాలైన సీఐడీ, విజిలెన్స్ ఏపీ ట్రాన్స్‌కో, ఏసీబీ, రైల్వే విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు కూడా కీలక స్థానాల్లో పోస్టింగులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు చర్చ జరుగుతోంది. కోడుమూరు సర్కిల్ స్థానాన్ని దక్కించుకునేందుకు ఇప్పటికే ముగ్గురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఆ పార్టీ ఇన్‌చార్జ్‌ని సంప్రదించినట్లు తెలిసింది.

**పదోన్నతి పొందినవారు కూడా...**

కర్నూలు రేంజ్ డీఐజీగా సెంథిల్ కుమార్ ఉన్న సమయంలో (ఈ ఏడాది జనవరి) 2009 బ్యాచ్‌కు చెందిన 47 మంది ఎస్‌ఐలకు(రేంజ్ పరిధిలో) సీఐలుగా పదోన్నతి లభించింది. అలాగే ఎస్పీ ఫక్కీరప్ప హయాంలో 2004, 2007, 2009 బ్యాచ్‌లకు చెందిన 13 మంది ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి లభించింది. ప్రస్తుతం వారు రేంజ్ పరిధిలోని వివిధ సర్కిళ్లలో పనిచేస్తున్నారు. టీడీపీ నాయకులతో సంబంధాలున్న వారిలోని కొందరు అధికారులు కూడా జిల్లాలోని ప్రాధాన్యత సర్కిళ్లలో పోస్టింగ్ దక్కించుకునేందుకు ఎవరి స్థాయిలో వారు ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే అంతర్‌రాష్ట్ర సరిహద్దు పంచలింగాల చెక్‌పోస్టు, పీసీఆర్, దిశ పీఎస్‌లో విధులు నిర్వహించిన మరో ఇన్‌స్పెక్టర్ ఆదోని నియోజకవర్గంలోని ప్రాధాన్యత ఉన్న సర్కిల్‌లో పోస్టింగ్ దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఎన్నికల ముందు జిల్లాకు బదిలీపై వచ్చి లూప్‌లైన్ విభాగంలో పనిచేస్తున్న మరో డీఎస్పీ ప్రాధాన్యత పోస్టు కోసం టీడీపీ నేతలతో టచ్‌లో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఈయన గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కీలక స్థానాల్లో విధులు నిర్వహించారు. గతంలో కర్నూలు స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహించిన అధికారి కూడా కర్నూలులోని ఏదో ఒక సర్కిల్‌లో పోస్టింగ్ దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆ శాఖ అధికారుల్లో చర్చ జరుగుతోంది.

### డిగ్రీ పరీక్షల్లో 9 మంది డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో శుక్రవారం జరిగిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో 9 మంది డిబార్ అయ్యారు. పరీక్షలకు 6,522 మందికి 5,968 మంది (92 శాతం)విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. నందికొట్కూరు బసిరెడ్డి డిగ్రీ కళాశాలలో 2, ఆలూరు శ్రీ రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో 2, డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నందికొట్కూరు శ్రీసాయిరాం డిగ్రీ కళాశాల, శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాల, బేతంచర్ల శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 9 మంది విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

### 15న జిల్లా స్థాయి విలువిద్య ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 15న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్–10, అండర్–13, అండర్–15 విభాగంలో జిల్లా స్థాయి విలు విద్య క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ క్రీడా సంఘం జిల్లా కార్యదర్శి కె. నాగరత్నమయ్య తెలిపారు. పూర్తి వివరాలకు సెల్: 93938–55460 నంబర్‌ను సంప్రదించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

# స్కాన్ చేస్తే ఓపీ చేతిలోకి

- పెద్దాసుపత్రిలో ఈ–డిజిటల్ ఓపీ ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): ఇకపై కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గంటల తరబడి ఓపీ కోసం క్యూలో నిలబడాల్సిన పనిలేదు. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే అక్కడ ఉండే స్కానర్‌పై స్కాన్ చేస్తే చాలు. అందులోని నంబర్‌ను కౌంటర్‌లో చెబితే వెంటనే ఓపీ ఇచ్చేస్తారు. ఈ విధానాన్ని శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి ప్రతిరోజూ 3 వేల మంది ఓపీ రోగులు వస్తుంటారని, ఆసుపత్రి ఆవరణలో ఉన్న నాలుగు, పీడియాట్రిక్, గైనిక్ విభాగం వద్ద రెండు ఓపీ కౌంటర్లు ఉన్నాయన్నారు. ఇక్కడ ఆయుష్మాన్ భారత్ ఈ–డిజిటల్ ఓపీ కౌంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. దీనివల్ల రోగులకు చాలా మేలు జరుగుతుందని...ఎక్కువ సేపు క్యూలో నిలబడాల్సిన అవసరం ఉండదన్నారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా డిజిటల్ స్కాన్ అండ్ షేర్/ ఏటీఎం, ఫోన్ పే, అభా యాప్ ద్వారా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ఓపీ నంబర్ పొందవచ్చన్నారు. దీని ద్వారా ఒక నిమిషం వ్యవధిలోనే ఓపీ చేతికి వస్తుందని తెలిపారు. ఆసుపత్రిలో ఇవి గాకుండా అదనంగా మరో రెండు ఓపీ కౌంటర్లను త్వరలో ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, బయోకెమిస్ట్రి హెచ్ఓడీ డాక్టర్ పద్మ విజయశ్రీ, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ ప్రశాంత్ కిశోర్ పాల్గొన్నారు.



ఈ–డిజిటల్ ఓపీ అందజేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి, కేఎంసీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ

## జీవం పోసుకుంది!

'అడెన్ సోనియా' మహా వృక్షం మళ్లీ జీవం పోసుకుంది. వృక్షమేమిటీ జీవం పోసుకోవడమేమిటీ అనుకుంటున్నారా? కర్నూలు శివారులోని గార్గేయపురం గ్రామం బయట 200 ఏళ్ల మహావృక్షం ఉండేది. కేజీ రోడ్డు నిర్మాణంలో భాగంగా దీనిని తొలగించాల్సి వచ్చింది. ఎంతో నేపథ్యమున్న ఈ వృక్షాన్ని ఎలాగైనా బతికించాలని అటవీశాఖ అధికారులు మూడురోజుల పాటు శ్రమించి వేర్లతో సహా పెకలించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12న క్రేన్ల ద్వారా ఐదు కిలోమీటర్ల దూరంలోని సిటీ ఫారెస్ట్‌కు తరలించి నాటారు. కెమికల్ ట్రీట్‌మెంట్ ద్వారా సంరక్షణ చర్యలు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ వృక్షం చిగురులు వేసింది. దీంతో తమ ప్రయత్నం సఫలమైందని అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



చిగురించిన అడెన్ సోనియా



నగరవనంలో నాటిన సమయంలో ఇలా.. (ఫైల్)



భారీ క్రేన్ల సాయంతో 200 ఏళ్ల మహావృక్షాన్ని తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

## క్లుప్తంగా

### గంజాయి కాల్చివేత



గంజాయిని కాల్చి వేస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: జిల్లాలోలోని నాలుగు సబ్ డివిజన్ల పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పట్టుబడిన 39.223 కేజీల గంజాయిని శుక్రవారం పోలీసులు కాల్చి వేశారు. ఈ సందర్భంగా డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ జయరాములు మాట్లాడుతూ సుమారు రూ.4.70 లక్షల విలువ చేసే గంజాయిని అయ్యలూరు మెట్ట సమీపంలోని నిర్జన ప్రాంతంలో కాల్చి వేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామనాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### అనారోగ్యంతో హెచ్‌ఎం మృతి

హొళగుంద: సుళువాయి కన్నడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎం. గురుసిద్దయ్యస్వామి (59) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మండల కేంద్రం హొళగుందకు చెందిన ఈయన కొంత కాలంగా మూత్రపిండాల సమస్యతో బాధ పడుతున్నాడు. ఇటీవలే మూత్రపిండ మార్పిడి కూడా జరిగింది. అయినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈయనకు భార్య, కూతురు ఉన్నారు. గురుసిద్దయ్యస్వామి మృతి విషయం తెలియగానే పలువురు ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు గ్రామానికి చేరుకుని నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### ఇసుక రవాణాలో నిబంధనలకు పాతర



టార్పాలిన్ బిగించుకోకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్

కర్నూలు (న్యూటౌన్): టార్పాలిన్ లేకుండా ఇసుక రవాణా చేస్తే రూ.5వేలు జరిమానా విధిస్తామని జిల్లా మైనింగ్ అధికారులు హెచ్చరిస్తున్నా ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలపై ట్రాక్టర్ డ్రైవర్లను మే 31వ తేదీ జిల్లా మైనింగ్ కార్యాలయానికి పిలిపించి టార్పాలిన్లు కొనుగోలు చేయించి అవగాహన కల్పించారు. భవిష్యత్తులో టార్పాలిన్‌తో ఇసుక ట్రాక్టర్ ట్రాలీని కప్పి ఉంచి రవాణా చేస్తామని ట్రాక్టర్ డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనుమతులు ఉన్నవారే ఇసుక రవాణా చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేస్తామని జిల్లా మైనింగ్ అధికారులు హెచ్చరించినా వారి ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. టార్పాలిన్లు లేకుండానే యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా మైనింగ్ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# మెదడులో కలకలం

- పెరుగుతున్న మెదడులో కణితుల బాధితులు
- ఆధునిక పద్ధతిలో ఆపరేషన్ల ద్వారా కణితి తొలగింపు
- పెద్దాసుపత్రిలో ప్రతి ఓపీకి 30 మందికి చికిత్స
- ప్రైవేటు ఆసుపత్రిలోనూ పెరిగిన బాధితులు
- ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే


కర్నూలు(హాస్పిటల్): మాట తడబడటం.. కంటి చూపు మసకబారడం.. చెవులు సరిగ్గా వినిపించకపోవడం.. మూతి వంకరపోవడం, ఫిట్స్ రావడం.. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఎందుకంటే అవి బ్రెయిన్ ట్యూమర్(మెదడులో కణితులు) లక్షణాలు కావచ్చు. ఇటీవల కాలంలో ఇలాంటి లక్షణాలతో ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మెదడులో కణితులపై అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో బ్రెయిన్ ట్యూమర్లు(మెదడులో కణితులు) ఉన్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో పాటు పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణాలకు చెందిన వారు కూడా ఇక్కడికే చికిత్స కోసం వస్తున్నారు. గతంలో మెదడులో ఏర్పడే కణితులకు చికిత్స కోసం హైదరాబాద్, బెంగళూరుకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కర్నూలులోనే అత్యాధునిక వైద్య విధానాలతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి లక్ష మందిలో ఏడుగురు మెదడులో కణితుల సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యుల గణాంకాలు చెబుతున్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరోసర్జరీ విభాగానికి ప్రతి బుధ, శనివారం ఓపీ చికిత్స చేస్తారు. ప్రతి ఓపీకి మెదడు, వెన్నుపూసకు సంబంధించి సమస్యలతో 250 నుంచి 300 మంది దాకా రోగులు వస్తుండగా అందులో 10 నుంచి 15 మంది మెదడులో కణితులతో వస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ప్రొఫెసర్, హెచ్‌ఓడీగా డాక్టర్ రామ్‌బాలాజీ నాయక్ ఉండగా, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా డాక్టర్ పుండరీకాక్షయ్య, డాక్టర్ నాగరాజన్, డాక్టర్ శశాంక్, డాక్టర్ రాజేష్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డితో పాటు నలుగురు పీజీ వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ మరో పాతిక మందికి పైగా న్యూరోసర్జన్లు ఉన్నారు. వీరి వద్దకూ రోజుకు 20 నుంచి 30 మంది దాకా కణితులతో బాధపడేవారు వస్తున్నారు.



జీజీహెచ్‌లోని న్యూరోసర్జరీ విభాగం

### బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలు



సాధారణంగా మెదడులో కణాలు చనిపోయి కొత్తగా పుట్టుకొస్తుంటాయి. కొన్నిసార్లు ఆ కణాలు చనిపోకుండానే కొత్తవి పుట్టుకొస్తాయి. అలా వచ్చిన కణాలు కణితులుగా మారతాయి. ఇందులో కొన్ని క్యాన్సర్‌గా మారి ప్రాణాంతకమవుతాయి. మరికొన్నింటిని శస్త్రచికిత్స ద్వారా తొలగిస్తే ఏ సమస్యా ఉండదు. మెదడు కణితుల లక్షణాలను రెండు రకాలుగా విభజించవచ్చు. మొదటిది జనరల్ లక్షణాలు. రెండవది ప్రత్యేకమైనది. జనరల్ లక్షణాలు కణితి పరిమాణాన్ని బట్టి వస్తాయి. తలనొప్పి, వాంతులు, చూపు మందగించడం, ఒత్తిడి పెరగడం, స్పృహకోల్పోవడం వంటివి. రెండోది మెదడులో కణితి ఏర్పడిన స్థానాన్ని బట్టి వస్తాయి. మెదడు ముందు భాగం, మధ్య భాగం, వెనుక భాగంలో ఆయా స్థానాలను బట్టి లక్షణాలు ఉంటాయి. అందులో మాట తడబడటం, చూపు మబ్బుగా కనిపించడం, చెవులు వినిపించకపోవడం, మూతి వంకరపోవడం, ఫిట్స్ రావడం, మాట తడబడటం, పక్షవాతం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ప్రతి తలనొప్పిని కణితికి కారణం అని చెప్పలేమని వైద్యులు చెబుతున్నారు. ఈ లక్షణాలు ఉన్నప్పుడు వైద్యులను తప్పనిసరిగా కలవాలని వారు సూచిస్తున్నారు.

### మెదడులో కణితులలో రకాలు

మెదడులోని కణజాలంలో ఏర్పడే ముద్దను మెదడు కణితి అంటారు. ఇవి ప్రైమరీ బ్రెయిన్ ట్యూమర్, సెకండరీ బ్రెయిన్ ట్యూమర్ అని రెండు రకాలు. ప్రైమరీ బ్రెయిన్ ట్యూమర్‌ను నాలుగు విభాగాలుగా విభజించారు. సెకండరీ బ్రెయిన్ ట్యూమర్‌లు శరీరంలో వివిధ భాగాల్లో సోకుతాయి. అవి రక్తంలో ప్రవేశించి మెదడుకు చేరతాయి. దీని ద్వారా మెదడులో కణితులు ఏర్పడతాయి. కొన్ని రసాయనాల బారిన పడటం, రేడియేషన్ ఎక్కువగా ఉండటం, ఎక్స్‌టీమ్ వైరస్ బారిన పడటం వల్ల ఈ కణితులు ఏర్పడతాయి.

### బ్రెయిన్ ట్యూమర్‌కు కారణాలు

మెదడులో కణితులు జన్యుపర లోపాల వల్ల, వంశ పారంపర్యంగా వస్తాయి. మెదడుకు రేడియేషన్ సోకడం వల్ల కూడా ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. సెల్‌ఫోన్ విపరీతంగా వాడటం వల్ల రేడియేషన్ సోకి మెదడులో గడ్డలు ఏర్పడే అవకాశం ఉంది. ప్రస్తుతం చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని వయస్సుల వారికీ బ్రెయిన్ ట్యూమర్లు వస్తున్నాయి.

### వ్యాధి నిర్ధారణ

మెదడులో కణితులు ఉన్నాయా లేదా అనేది నిర్ధారించడానికి మూడు రకాల పరీక్షలు ఉన్నాయి. మొదటిది క్లినికల్, రెండోది రేడియాలజీ, మూడోది సర్జికల్ ద్వారా నిర్ధారిస్తారు. ఇందులో సీటీస్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్‌లో తేలిపోతుంది. కానీ కొందరిలో సర్జికల్ ద్వారా కూడా నిర్ధారణ చేయవచ్చు. ఈ స్కాన్‌లలో కణితులను నిర్ధారణ చేసుకున్న తర్వాత చికిత్స ప్రారంభిస్తారు.

### పెద్దాసుపత్రిలో మెరుగైన వైద్యం



న్యూరోసర్జరీ విభాగానికి ప్రతి ఓపీకి 10 నుంచి 20 మంది దాకా బ్రెయిన్ ట్యూమర్ రోగులు వస్తుంటారు. కొందరికి మందులు ఇచ్చి పంపిస్తాం. మరికొందరికి సర్జరీ అవసరం అవుతుంది. నెలకు 10 నుంచి 15 మందికి ఆపరేషన్ నిర్వహిస్తాం. ఇందుకోసం అడ్వాన్స్‌డ్ మైక్రోస్కోప్‌లు అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా పూర్తిగా మత్తు ఇచ్చి ఎక్కువ కేసులు ఆపరేషన్ చేస్తాం. కానీ కొన్ని కేసుల్లో స్వల్పంగా మత్తు ఇచ్చి రోగి స్పృహలో ఉన్నప్పుడే ఆపరేషన్ చేస్తాం. దీనిని అవేక్ క్రేన్‌యాటి అంటారు. ఆపరేషన్లన్నీ పూర్తిగా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యలోనే నిర్వహిస్తాం.

– డాక్టర్ జి.రామ్‌బాలాజీ నాయక్, హెచ్‌ఓడీ, న్యూరోసర్జరీ విభాగం, కర్నూలు జీజీహెచ్

### క్యాన్సర్‌కు దారితీస్తాయి



బ్రెయిన్‌లోని కణితుల సమీపంలో కణజాలం, నిర్మాణాల్లో వచ్చే గడ్డలు, కణాల పెరుగుదలనే బ్రెయిన్ టూమర్స్ అంటారు. వీటిలో కొన్ని క్యాన్సర్‌తో సంబంధం లేనివి, మరికొన్ని క్యాన్సర్‌తో సంబంధం ఉన్నవి. బ్రెయిన్ ట్యూమర్ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. దీర్ఘకాలం పాటు రేడియేషన్‌కు గురయ్యే వ్యక్తులు, పొగాకు తాగే వ్యక్తులు బ్రెయిన్ ట్యూమర్‌లకు గురయ్యే ప్రమాదం ఉంది. బ్రెయిన్ టూమర్ ప్రమాదకరమైన వ్యాధి. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం. ఏ మాత్రం అనుమానం వచ్చినా వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ కేఎస్. విశ్వకుమార్, న్యూరోసర్జన్, కర్నూలు

# మృగశిర వచ్చె.. వానలు తెచ్చె!

- తొలకరి జల్లులతో వాతావరణంలో మార్పులు
- మృగశిర రాకతో ఏరువాక ప్రారంభం



గ్రామాల్లో పెంచుకుంటున్న నల్లకోళ్లు

మహానంది: వేసవి కాలం వచ్చిందంటే భానుడి భగభగలతో ప్రజలు అల్లాడి పోతారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఎండల తీవ్రత విపరీతంగా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వేసవిలో అన్ని కార్తెల కంటే రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయని నానుడి. రోహిణి తర్వాత వచ్చే మృగశిర కార్తెకు ఎంతో ప్రాధాన్యత ఉంది. జ్యోతిష్య శాస్త్ర ప్రకారం మనకు 27 నక్షత్రాలు. సూర్యుడు ఒక్కో నక్షత్రంలో ప్రవేశించే దానిని బట్టి ఆ నక్షత్రం పేరుతో కార్తెలు ఏర్పడతాయి. మృగశిర కార్తెను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేకంగా జరుపుకుంటారు.

### మబ్బులు కమ్మే మేఘాలు..

విపరీతమైన ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు మృగశిర కార్తె రాకతో వాతావరణం చల్లబడటంతో ఊపిరిపీల్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు వృద్ధి చెందాలని, అన్నదాతల ఇంట సిరులు పండాలని కోరుకుంటూ మృగశిర కార్తె శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నైరుతి రుతు పవనాల ఆగమనం సైతం మొదలై శుక్రవారం భారీ వర్షం కురిసింది. వ్యవసాయ ఆధారిత దేశమైన భారతదేశంలో నైరుతి రుతు పవనాల రాకతో వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. పంటలు పండటానికి అవసరమైన వర్షాలు కురవడం ప్రారంభమయ్యేది ఈ మృగశిర కార్తెలోనే కావడంతో ఈ కార్తెకు ఇంత ప్రాధాన్యత.

### ఆరోగ్య సమస్యలకూ పరిష్కారం

మృగశిర కార్తె రావడంతో భగభగమనిపించే ఎండల నుంచి ఉపశమనం కలుగుతుంది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. శరీర ఉష్ణోగ్రతల్లో మార్పు వస్తుంది. సాధారణంగా వచ్చే జలుబు, జ్వరం, అస్తమా వంటి రోగాలు వ్యాపిస్తాయి. దీంతో మృగశిర కార్తె ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో బెల్లంలో ఇంగువ కలిపి తింటారు. దీని ద్వారా శరీరంలో ఉష్ణోగ్రత ప్రేరేపించి వర్షాకాలంలో సోకే వ్యాధులను రాకుండా చేస్తుందని పెద్దలు నమ్ముతారు.

### నల్ల నాటు కోళ్లకు డిమాండ్

మృగశిర కార్తె రాకతో వాతావరణంలో మార్పులు రావడం సహజం. మబ్బులు కమ్మే నల్లటి ఆకాశం కనిపిస్తుంది. దీంతో అనాదిగా నల్లటి రంగు మృగశిర కార్తెకు గుర్తుగా నిలుస్తుంది. ఈ కార్తెలో నల్లటి రంగులో ఉన్న కోళ్లు, పొట్టేళ్లు, మేకపోతులకు డిమాండ్. సాధారణంగా లభించే బ్రాయిలర్ చికెన్ ధర రూ. 280 నుంచి రూ.300 ఉంది. నాటుకోళ్లకు మరింత డిమాండ్ నెలకొంది. అందులో నల్లరంగులో ఉన్న కోళ్లకు మరింత ఆదరణ పెరిగింది. కార్తె ప్రారంభం శుక్రవారం అయినా కొంత మంది మాంసాహారాన్ని తీసుకోకపోవడంతో శని, ఆదివారాల్లో తీసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నల్ల రంగుల్లో ఉన్న పొట్టేళ్లు, మేకపోతులను ఇప్పటికే పలువురు కొనుగోలు చేసి తీసుకొచ్చారు. ఆరోగ్య పరంగా చెప్పుకుంటే కోడి మాంసం వేడి చేస్తుందని, తద్వారా శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుందని, సీజనల్‌గా వచ్చే వ్యాధులు రావన్నది అందరికీ తెలిసిందే. ఈ సీజన్‌లోనే చేప మందు ఇవ్వడం జరుగుతుంది. చేపలు తినడం ద్వారా గుండె జబ్బులు, అస్తమా రోగులకు ఉపశమనం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చేపలను ఇంగువలో, చింతచిగురులో పెట్టి తీసుకుంటారు.

# ఊపిరి ఉన్నంత వరకు జగనన్న వెంటే



మాట్లాడుతున్న యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్దార్థరెడ్డి

- కార్యకర్తలకు అండగా ఉంటా
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: ఊపిరి ఉన్నంత వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటానని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడైనా టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేశామా అని ప్రశ్నించారు. ఇలా వైఎస్సార్‌సీపీ నాయకులను భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానన్నారు. మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి మాట్లాడుతూ ఏ కార్యకర్తకు ఏ ఆపద వచ్చినా అండగా నిలుస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు చంద్రమౌళి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, జెడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, సర్పంచులు రవియాదవ్, జనార్దన్‌గౌడు, నక్క విజయకుమార్ పాల్గొన్నారు.

# వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ఖైరూన్‌బీ

పగిడ్యాల: అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నెహ్రూనగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దూదేకుల కాశీం కుమారుడు సలీంమాలిక్ కర్నూలు మండలం దేవమడ గ్రామానికి చెందిన పెద్దశాలు కుమార్తె ఖైరూన్‌బీ(26)ని 5 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉసేన్ ఉన్నాడు. పెళ్లైన ఏడాది నుంచి అత్త శాలుబీ, కోడలు ఖై రూన్‌బీ తరచూ గొడవ పడేవారు. దీంతో వేరు కాపురం ఉందామని ఖైరూన్‌బీ భర్తను కోరినా పట్టించుకునేవాడు కాదు. ఈక్రమంలో గురువారం కోడలు పనికి వెళ్లకపోవడంతో అత్త గొడవ పెట్టుకుంది. ఇదే విషయమై కోడలు తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పి తనను తీసుకెళ్లాలని కోరింది. ఇంతలో శుక్రవారం తెల్లవారేలోగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి పెద్ద శాలు గ్రామానికి చేరుకుని తమ కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, అత్త, భర్త కొట్టి చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ముచ్చుమర్రి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ జయశేఖర్ తెలిపారు.

# వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి



కేశవులుకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది



బాధితుడిని పరామర్శించిన కోట్ల హర్షవర్దన్‌రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: మండలంలోని కొత్తపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు.. కొత్తపల్లెకు చెందిన దయ్యాల కేశవులు, చిన్న మద్ది, ప్రసాద్, రంగస్వామి, క్రిష్ణలపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు చిన్న మద్దిలేటి, గిడ్డయ్య, చిన్న గిడ్డయ్య, రాధాక్రిష్ణ, మిషన్ గిడ్డయ్య, బాలమద్దిలతో పాటు, మరికొందరు కలిసి శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ సీపీకి సపోర్ట్ చేస్తారా అంటూ వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెంచుకుని కేశవులు, చిన్న మద్దిలపై విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు కోడుమూరు ఆస్పత్రికి తరలించారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఆదిమూలపు సతీష్ కర్నూలు ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు.

### వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల గ్రామంలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తమ పార్టీ విజయోత్సవ ర్యాలీలో భాగంగా స్థానిక ఆంజనేయస్వామికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకునేందుకు బయలుదేరారు. ఈ సందర్భంలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు గొల్ల అశోక్ తన ఇంటి ముందు ఉన్న ఎడ్ల బండిపై పడుకుని ఉండగా కొందరు టీడీపీ యువకులు బీరు బాటిల్‌తో అతని తలపై బాదారు. అశోక్ కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు వచ్చి తమ వాడిని ఎందుకు కొట్టారని నిలదీశారు. దీంతో వారిపై కూడా దాడి చేశారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు గొల్ల అశోక్, గొల్ల పెద్దాయన్న, పెద్ద మద్దిలేటి, రాణి, చిట్టెన్న, హరీంద్ర, కృష్ణయ్య, చిన్నయ్య, ఖుర్షీద్ బాషా, ఫరీదా, రాజశేఖర్‌రెడ్డి, బుడ్డన్న, పెద్దయ్యతో పాటు టీడీపీకి చెందిన మరో నలుగురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని బాధితులను ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

# వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులను అరికట్టాలి

కర్నూలు (లీగల్) : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం జిల్లాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని, దీనిని పోలీసు యంత్రాంగం అరికట్టాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రెసిడెంట్ పి.సువర్ణారెడ్డి, జోనల్ ఇన్‌చార్జి ఎం.ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా తగిన విచారణ జరిపి నిందితులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో న్యాయం జరగకపోతే బాధితులు కర్నూలు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు వారికి రిజిస్టర్ పోస్టు ద్వారా కంప్లయింట్ పంపాలని, తద్వారా గౌరవ కోర్టులలో ప్రైవేటు కంప్లయింట్ దాఖలు చేసి కేసు నమోదు చేయించడానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే దాడుల సమయంలో సెల్‌ఫోన్ ద్వారా ఫొటోలు, వీడియోలు చిత్రీకరించాలని, అవి కేసులో బాధితులకు సాక్ష్యాలుగా ఉపయోగపడతాయన్నారు. జిల్లాలో ఎక్కడైనా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు జరిగితే ఈ క్రింది మొబైల్ నంబర్లకు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందగలరని కోరారు. పి.మధుసూదన్ రెడ్డి (ఆదోని) – 9849505971, బి.లక్ష్మీకాంత్ (ఆలూరు) – 8008640346, కె.రాజేంద్రప్రసాద్ (ఎమ్మిగనూరు) – 9160595555, ఎం.కె.గురురాజారావు (మంత్రాలయం) – 9010620344, ఎం.ప్రభాకర్ (కోడుమూరు) – 9700801258, ఎస్.నరేంద్రారెడ్డి (పత్తికొండ) – 9440294473.

# పుష్ప సినిమా తరహాలో మద్యం తరలింపు

- నిఘావేసి పట్టుకున్న పోలీసులు
- బొలెరో వాహనంతో పాటు 2,880 టెట్రా ప్యాకెట్లు సీజ్



అక్రమ మద్యాన్ని చూపుతున్న సీఐ రామకృష్ణయ్య, పోలీసులు

గోనెగండ్ల: పుష్ప సినిమాలో ఎర్రచందనాన్ని సినీ హీరో అల్లు అర్జున్ పాల వ్యాన్‌లో ఎలా తరలించాడో అదే తరహాలోనే ఇద్దరు వ్యక్తులు కర్ణాటక మద్యం తరలిస్తూ పోలీసులకు చిక్కారు. సీఐ రామకృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన మిన్నల్లా, అతని బంధువు కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన షేక్షావలి అను ఇద్దరు కర్ణాటకకు చెందిన మద్యంను బొలెరో గూడ్స్ వాహనంలో అక్రమంగా తెచ్చి వ్యాపారం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిద్దరిపై దృష్టిసారించారు. శుక్రవారం ఉదయం గోనెగండ్ల సమీపంలోని గంజిహళ్లి రోడ్డులో ఎల్లెల్సీ కాలువ దగ్గర వారి వాహనాన్ని గుర్తించి పట్టుకున్నారు. పోలీసులను చూడగానే నిందితులు పారిపోయారు. వాహనాన్ని తనిఖీ చేయగా 30 బాక్సుల్లో 2,880 టెట్రా ప్యాకెట్లు ఉన్నాయి. నిందితులపై కేసు నమోదు చేసి, మద్యం, వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపాడు. తనిఖీలో ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు బ్రహ్మయ్య, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గుప్త నిధుల కోసం జేసీబీతో తవ్వకాలు

- ప్యాపిలి మండలం రాచర్ల రెవెన్యూ గ్రామం పరిధిలో ఘటన



గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): గుప్త నిధుల కోసం ఏకంగా జేసీబీతో తవ్వకాలు జరపడం కలకలం రేపింది. ప్యాపిలి మండలం రాచర్ల రెవెన్యూ గ్రామానికి చెందిన సర్వే నెంబరు 1-3 డీ భూమిలో చింతచెట్టు, కట్ట ఉన్నాయి. ఈ భూమి నేరడుచెర్ల గ్రామస్తులది. 15ఏళ్ల క్రితం వరకు ఈ పొలం మీదుగా కంబగిరిస్వామి దేవస్థానానికి భక్తులు కాలినడకన వెళ్లేవారు. వేసవిలో స్వామి ఉత్సవాలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఈ చెట్టు కింద వందల ఏళ్ల క్రితం పెద్ద గచ్చు ఏర్పాటు చేసి కాలినడకన వెళ్లేవారికి తగు నీరు అందించడం జరిగేది. ప్రస్తుతం ఈ పొలం పక్క నుంచి దేవస్థానానికి రోడ్డు వేశారు. అయితే, ఈ గచ్చు కింద నిధి ఉండొచ్చనే అభిప్రాయంతో గతంలో కొందరు తవ్వకాలు జరిపారు. తాజాగా గురువారం అమావాస్య కావడంతో అర్ధరాత్రి ఏకంగా జేసీబీ ఉపయోగించి తవ్వకాలు జరిపారు. ముందుగా పూజలు జరిపినట్లు నిమ్మకాయలు, పసుపు, కుంకుమ తదితర పూజా సామగ్రి కూడా ఉంది. ఈ సంఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకొని తవ్వకాలు జరిపిన వారిని పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.